సాక్షి అనంతపురం

సోమవారం । 9 । జూన్ । 2025



తాడిపత్రిలో పట్టపగలే చోరీ

తాడిపత్రిలో ఆదివారం దొంగలు రెచ్చిపోయారు. పట్టపగలే ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. 8లో



దుర్గంలో వేరుశనగ..

ఖరీఫ్ పంటల సాగులో ప్రాంతాల వారీగా వైవిధ్యం కనిపిస్తోంది. రాయదుర్గం ప్రాంతంలో అత్యధికంగా వేరుశనగ సాగు చేసే అవకాశం ఉంది. 8లో

గరిష్టం/కనిష్టం
39.2°/23.8°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

హవ్వ.. ఇదేం లైనింగ్!

- ఇష్టారాజ్యంగా హంద్రీ–నీవా లైనింగ్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు
- మండిపడుతున్న ప్రజలు



హంద్రీ–నీవా 235వ కిమీ వద్ద కాలువ గట్టుపై జేసీబీతో మట్టి తీయడంతో పడిన గుంతలు



గట్టు నుంచి తీసిన మట్టితో లైనింగ్ చేపట్టిన దృశ్యం



కూడేరు: జిల్లా రైతాంగం వద్దు బాబోయ్ అని మొత్తుకుంటున్నా చంద్రబాబు సర్కారు హంద్రీ–నీవా లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. తమ అనుయాయ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల వినతులను సైతం పక్కకు పెట్టేసింది. పోనీ.. లైనింగ్ పనులనైనా సరిగా చేపడుతున్నారా.. అంటే అదీ లేదు. తూతూమంత్రంగా అక్కడి మట్టిని ఇక్కడ వేస్తూ నాసిరకంగా పనులు చేస్తున్నారు. కాంట్రాక్టర్ల ఘన కార్యంతో రైతులే కాకుండా సాధారణ ప్రజలు కూడా భవిష్యత్తులో ఇబ్బందులు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కూడేరు మండలంలో చేపడుతున్న లైనింగ్ పనులను చూస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది.

ఇష్టం వచ్చినట్లుగా..

హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనులను కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. బయట నుంచి ఎర్రమట్టి తెచ్చి లైనింగ్ చేయాల్సి ఉన్నా.. కాంట్రాక్టర్లు ఏకంగా కాలువ గట్టు మట్టినే జేసీబీతో తవ్వి పనులు చేస్తున్నారు. కూడేరు మండల పరిధిలోని తిమ్మాపురం పై భాగాన హంద్రీ–నీవా కాలువ 235.500 కి.మీ వద్ద ఇలా జరుగుతోంది. కాలువ గట్టు పైభాగాన ఓబిరెడ్డి కుంట ఉంది. వర్షం వస్తే ఎంఎంహళ్లి, పి.నారాయణపురం గ్రామాల వంకల ద్వారా నీరు వచ్చి ఈ కుంటలో చేరుతుంది. 2015–17 మధ్య కాలంలో కాలువ గట్టు కోతకు గురికాకుండా రాతి కట్టడం కట్టి, మధ్యలో నల్లమట్టి వేసి ఇరు వైపులా ఎర్ర మట్టి వేశారు. ప్రస్తుతం కాంట్రాక్టర్లు ఆ కాలువ గట్టు మట్టినే జేసీబీతో తవ్వి హంద్రీ–నీవా లైనింగ్ చేస్తున్నారు. దీంతో కాలువ గట్టుకు గుంతలు ఏర్పడ్డాయి. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఓబిరెడ్డి కుంట నుంచి వచ్చే నీటి ప్రవాహానికి కాలువ గట్టు దెబ్బతినే ప్రమాదముంది. అలా జరిగితే హంద్రీ–నీవా గుండా ప్రవహించే నీరు దిగువన ఉన్న తిమ్మాపురం గ్రామాన్ని ముంచెత్తే ప్రమాదముంది. ఉన్నతాధికారులైనా స్పందించి గట్టు మట్టిని తవ్వకుండా బయట నుంచి మట్టి తెచ్చేలా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పర్యవేక్షణ లేకపోవడంతోనే..



అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంతోనే కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేస్తున్నారు. ఎక్కడైనా కాలువ గట్టు దెబ్బతిని ఉంటే మట్టితో బాగు చేయాలి. కానీ కాంట్రాక్టర్లు గట్టుకు గుంతలు పెడితే భద్రత ఎలా ఉంటుంది? కాలువ పై భాగాన ఓబిరెడ్డి కుంట ఉంది. అందులోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరి కాలువ వైపు ప్రవహిస్తుంది. జేసీబీతో గుంతలు పెట్టడంతో కాలువ గట్టు భవిష్యత్తులో కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. నీరు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి ప్రవేశిస్తే రైతులు నష్ట పోవాల్సి వస్తుంది.

– మేరీ నిర్మలమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు, కూడేరు మండలం

కాంట్రాక్టర్ల లబ్ధికే పనులు



అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చేందుకే లైనింగ్ పనులు చేస్తున్నట్లుగా ఉంది. పనులను నాణ్యతగా చేయకపోగా ఉన్న కాలువ గట్టును పాడు చేయడం అన్యాయం. బయట నుంచి మట్టి తెచ్చి లైనింగ్ పనులు చేయాలి. నాసిరకంగా పనులు చేసుకొనిపోతే భవిష్యత్‌లో కాలువ గట్టు తెగి పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు దెబ్బతింటాయి. లైనింగ్ పనులతో భూగర్భ జలాలు అడుగంటి రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

– రాయుడు, జిల్లా కోశాధికారి, అఖిల భారత రైతు కూలీ సంఘం

ఉదిరిపికొండలో ట్యాంకర్లతో నీటి సరఫరా



ఉదిరిపికొండలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: ఉదిరిపికొండలో ట్యాంకర్లతో అధికారులు నీటి సరఫరా చేపట్టారు. 'తార స్థాయికి దాహం కేకలు' అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. కూడేరు మండల పరిధిలోని ఉదిరిపికొండలో రెండు ట్యాంకర్లు ఏర్పాటు చేసి మంచి నీటిని సరఫరా చేశారు. అదే విధంగా సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ నుంచి కూడా నీటిని సరఫరా చేశారు. గ్రామంలో అదనంగా బోరు కూడా వేయిస్తామని అధికారులు తెలిపారు. 20 రోజులుగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఎట్టకేలకు నీరు సరఫరా కావడంతో సమస్య కొంత వరకు తీరింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



కుళాయి వద్ద 'సత్యసాయి' నీరు పట్టుకుంటున్న దృశ్యం

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఈఏపీసెట్‌లో 15,137 మంది అర్హత



భూపతి నితిన్ అగ్నిహోత్రి

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్‌లో 15,137 మంది అర్హత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో 10,659 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 4,478 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఆదివారం ఈ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మొత్తం 16,658 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 10,659 మంది అర్హత సాధించారు.

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో...

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి మొత్తం 5,656 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో మొత్తం 4,478 మంది అర్హత సాధించారు.

సత్తా చాటిన నితిన్ అగ్నిహోత్రి

ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన 'అనంత' కుర్రాడు నితిన్ అగ్నిహోత్రి ఏపీఈఏపీసెట్‌లోనూ తనకు ఎదురు లేదని నిరూపించాడు. 94.1576 మార్కులతో రాష్ట్రంలో 5వ ర్యాంకు సాధించి ప్రశంసలందుకున్నాడు. ఈ విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో 99.997 పర్సంటైల్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 183వ ర్యాంకు సాధించాడు. అనంతపురం నగరానికి చెందిన నితిన్ అగ్నిహోత్రి తండ్రి భూపతి శ్రీకాంత్ బిల్డర్ కాగా, తల్లి పాలసముద్రం కల్యాణి గృహిణి. ఈఏపీసెట్‌లో 5వ ర్యాంకు సాధించడం పట్ల సంతోషంగా ఉందని నితిన్ పేర్కొన్నాడు. అడ్వాన్స్‌డ్ ఫలితాల ఆధారంగా ఐఐటీ మద్రాస్‌లో జాయిన్ కావాలనుకుంటున్నట్లు వెల్లడించాడు.



- ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్,ఫార్మసీ విభాగంలో అనంతపురం నగరానికి చెందిన కూరపాటి సైనారెడ్డి సత్తాచాటింది. 300 మార్కులకు 287 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 71వ ర్యాంకు దక్కించుకుంది. ఈ అమ్మాయి విజయవాడ నారాయణ కళాశాలలో ఇంటర్ చదివింది. తండ్రి కూరపాటి నరసింహారెడ్డి విద్యాశాఖలో పీడీగా పని చేస్తుండగా, తల్లి ధనలక్ష్మి ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు.

429 మందికి ఎస్‌ఏలుగా పదోన్నతి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 429 మంది ఎస్జీటీలకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేడర్ పదోన్నతులు లభించాయి. ఇందులో పీఎస్‌హెచ్‌ఎంలుగా 141 మంది (కన్నడ 1, తెలుగు 130, ఉర్దూ 10) ఉన్నారు. అలాగే ఎస్‌ఏ ఇంగ్లిష్ 46 మంది, హిందీ 01, తెలుగు 01, ఉర్దూ 01, బీఎస్ (తెలుగు) 38 మంది, బీఎస్ (ఉర్దూ) 04, గణితం (తెలుగు) 80 మంది, గణితం (ఉర్దూ) 05, పీడీ (తెలుగు) 06, పీఎస్ (కన్నడ) 01, పీఎస్ (తెలుగు) 46, పీఎస్ (ఉర్దూ) 01, సోషల్ (కన్నడ) 02, సోషల్ (తెలుగు) 50, సోషల్ (ఉర్దూ) ఆరుగురికి పదోన్నతి కల్పించారు. వీరితో పాటు ఇటీవల తప్పనిసరి, రిక్వెస్ట్ బదిలీలైన స్కూల్ అసిస్టెంట్లందరూ ఆదివారం వారి పాత పాఠశాలల్లో రిలీవ్ అయ్యారు. సోమవారం కొత్త స్కూళ్లల్లో రిపోర్ట్ చేసుకోనున్నారు.

ఎస్జీటీలకు నేడు వెబ్ ఆప్షన్లు

ఎస్జీ టీచర్ల బదిలీల్లో భాగంగా సోమవారం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని టీచర్లు, సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం మాత్రం వెబ్ కౌన్సెలింగ్‌కే మొగ్గు చూపింది. ఆసక్తి ఉన్న వారు వ్యక్తిగతంగా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. మరోవైపు ప్రతి మండల ఎమ్మార్సీల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లోకి వెళ్తే... సిబ్బంది వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

మాట తప్పిన కూటమి ప్రభుత్వం



నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్జీటీల బదిలీలు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా చేపడతామన్న ప్రభుత్వం మాట తప్పిందంటూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన గళం వినిపించారు. ఇందులో భాగంగా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ గత నెల 19, 20 తేదీల్లో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చల సందర్భంగా ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. వేలాది మంది బదిలీలు కావాల్సిన నేపథ్యంలో వెబ్‌ఆప్షన్లు ఇవ్వడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెబ్ కౌన్సెలింగ్‌కు అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఎన్ని రోజులైనా నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని డీఈఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గౌడ్, 'ఆప్టా' జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, యూటీఎఫ్ లింగమయ్య, గోవిందరాజులు, జయ చంద్రా రెడ్డి, సుధాకర్, ఎస్టీయూ రమణారెడ్డి, రామాంజనేయులు, ఎ. హరి ప్రసాద్ రెడ్డి, 'అపస్' ఎర్రి స్వామి, ఏపీటీఎఫ్ వెంకటేశులు, సిరాజుద్దీన్, ఏపీటీఎఫ్ (1938) శ్రీనివాస్ నాయక్, శ్రీనివాసులు, విశ్వనాథ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, పీఆర్టీయూ విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి కేశవరెడ్డి, హెచ్‌ఎం అసోసియేషన్ జయరామిరెడ్డి, ఎస్‌ఎల్‌టీఏ శివానందరెడ్డి, పీడీ అసోసియేషన్ శ్రీనివాసులు, కేశవ మూర్తి, నరసింహారెడ్డి, ప్రభాకర్, ఎస్‌టీఏ జయరాం నాయక్, ఆర్జేయూపీ రామాంజనేయులు, బీసీటీఏ వరదరాజులు, గిరిజన ఉపాధ్యాయ సంఘం శివయ్య, రవీంద్ర నాయక్, పీఎస్‌హెచ్‌ఎం అసోసియేషన్ మర్రి స్వామి, ఆర్‌యూపీపీ ఎర్రి స్వామి, తులసి రెడ్డి, వైఎస్సార్ టీఏ నాయకులు వెంకటరమణ, రవీంద్రారెడ్డి రాధాకృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, బీటీఏ ఓబులేసు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీల కౌన్సెలింగ్ మ్యానువల్‌గానే చేపట్టాలి

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీల్లో భాగంగా ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ మ్యానువల్‌గానే చేపట్టాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను అనంతపురం నగరంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్జీటీల కౌన్సెలింగ్‌లో మ్యానువల్ పద్ధతి పాటించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఎదురయ్యే సమస్యలను విన్నవించారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు రాధాకృష్ణారెడ్డి, జీవీ రమణప్ప, గంగాధర్ రెడ్డి రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

మట్టి లేదు.. పరీక్షలూ లేవు!

- ఈ ఏడాది 25,107 భూసార పరీక్షలు లక్ష్యం
- ఇప్పటి వరకు మట్టి నమూనాల సేకరణ శూన్యం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఈసారి మట్టి నమూనాలు సేకరించలేదు. భూసార పరీక్షలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 25,107 భూసార పరీక్షలు చేపట్టాలని కమిషనరేట్ నుంచి లక్ష్యం నిర్దేశించారు. ఈ క్రమంలో మే నెలాఖరు నాటికి 31 మండలాల నుంచి ఆర్‌ఎస్‌కేల వారీగా కేటాయింపుల మేరకు మట్టి నమూనాలు సేకరించాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఏప్రిల్ 26న ఆదేశాలు ఇచ్చారు. జూన్ నుంచి విరామం లేకుండా మట్టి పరీక్షలు నిర్వహించి సకాలంలో రైతులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ, ఏఓలకు దిశా నిర్దేశం చేశారు. కానీ జూన్ మొదటి వారం ముగిసినా ఇప్పటి వరకు మండలాల నుంచి మట్టి నమూనాలు రాకపోవడం గమనార్హం. కేవలం ఆత్మకూరు మండలం నుంచి కొన్ని శ్యాంపిల్స్ వచ్చినట్లు ప్రయోగశాల అధికారులు తెలిపారు. ప్రయోగశాలలో మట్టి పరీక్షలు ఇంకా మొదలు పెట్టనేలేదు.

12 రకాల పరీక్షలు..

రైతులకు ఎరువుల ఖర్చు తగ్గించి లాభసాటి వ్యవసాయం కోసం మట్టి పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి ఆర్‌ఎస్‌కే పరిధిలో తప్పనిసరిగా నిబంధనల మేరకు మట్టి నమూనాలు సేకరించి పంపాలి. ఒక్కో మట్టి నమూనా నుంచి 12 రకాల పరీక్షలు నిర్వహించి పోషకాలు విశ్లేషిస్తారు. పీహెచ్ (భూమి స్థితి) శాతం, ఎలక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్పరస్ (పీ), పొటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూలపోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), అలాగే సూక్ష్మపోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషిస్తారు. ఆ తర్వాత రైతులు సాగు చేసే పంటలను బట్టి వాడాల్సిన ఎరువులను హెల్త్‌కార్డు ద్వారా సిఫారసు చేస్తారు. అయితే, కీలకమైన వేసవిలో మట్టి సేకరణ జరగకపోవడంతో ఈ సారి మట్టి పరీక్షలకు ప్రాధాన్యత లేకుండా పోయింది. ఇప్పటికే వర్షాలు కురవడం, ఖరీఫ్ పంటల సాగుకు సమయం సమీపించడంతో భూసార పరీక్షల ద్వారా పెద్దగా ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. మరోవైపు ఇష్టారాజ్యంగా మట్టిని సేకరించి పంపడం, ప్రయోగశాలలో కూడా తూతూ మంత్రంగా పరీక్షలు చేపట్టడం వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదనే విమర్శలూ లేకపోలేదు.

ఆర్డీటీకి అవాంతరాలు సృష్టించడం దారుణం





ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, వైఎస్సార్ సీపీ నేత చవ్వా రాజశేఖర్ రెడ్డి, తదితరులు

← రంగయ్య పాదయాత్రకు సంఘీభావంగా నడుస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్టీ పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్

శెట్టూరు: 'ఏపీ, తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రంలోనూ ఆర్డీటీ సేవలు అందిస్తోంది. పేద ప్రజల బాగు కోసం 55 ఏళ్లుగా నిస్వార్థంగా పనిచేస్తోంది. అలాంటి సంస్థకు అవాంతరాలు సృష్టించడం దారుణం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్రకు శెట్టూరు మండలం చెర్లోపల్లిలో 'అనంత' సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. రంగయ్య పాదయాత్రను టీడీపీ నాయకులు అడ్డుకోవాలని చూస్తుండటం హేయమన్నారు. పేదల బాగు కోసం కృషి చేస్తున్న ఆర్డీటీకి బీజేపీ మతం రంగు పులిమిందన్నారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలోనే ఆర్డీటీకి నోటీస్ ఇచ్చినట్లు గుర్తుచేశారు. లోకేష్ తన పాదయాత్ర సమయంలో మాంఛో ఫెర్రర్‌కు తప్పకుండా సాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, బీజేపీ మంత్రి కూడా ఆ విషయాన్ని చెప్పినట్లు గుర్తుచేశారు. ఢిల్లీలో ప్రధాని మోదీని, కేంద్ర హోం మంత్రిని కలిసిన మంత్రి లోకేష్ ఆర్డీటీ గురించి ఎందుకు చెప్పలేదని నిలదీశారు. 3 నెలల నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా కూటమి నేతలు పట్టించుకోవడం లేదని, వారి చేతకానితనం వల్లే ఆర్డీటీకి ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ఎంపీపీ సోమనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్యాలు, పార్టీ మండల కన్వీనర్ ఎంఎస్ రాయుడుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేతల సంఘీభావం..

రంగయ్య పాదయాత్రకు ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నేత చవ్వా రాజశేఖర్ రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆర్డీటీకి అండగా నిలవకపోతే కూటమి పాలకులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని వారు విమర్శించారు.

ప్రజల దాహం కేకలు పట్టవా?

కణేకల్లు: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అటకెక్కి ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల గొంతెండుతున్నా కూటమి ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్లు కూడా లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. మండలంలోని హనకనహళ్ గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి నాగిరెడ్డి,పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్ప చౌదరి, మండల కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు వేమన, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, సొల్లాపురం భాస్కర్‌రెడ్డితో కలిసి 'అనంత' విలేకర్లతో మాట్లాడారు. కూటమి పాలకుల వైఫల్యం కారణంగానే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిలిచిపోయిందన్నారు. వర్కర్లకు బకాయిలు చెల్లించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఏమాత్రం పట్టడం లేదన్నారు. ఆదాయం వచ్చే పనులపై శ్రద్ధ చూపుతున్నారే గానీ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సమస్యల పట్ల కలెక్టర్ వినోద్ కుమార్ అయినా స్పందించాలని విన్నవించారు. సమస్యను సత్వరమే పరిష్కరించి గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్



యోగా సాధన చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్: యోగాతో మానసికోల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం శిల్పారామంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 14న అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, తహసీల్దార్ అందే హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగా ర్యాలీలు నిర్వహించండి

అనంతపురం అర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా సచివాలయాల పరిధిలో సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ యోగాపై ప్రజలను చైతన్య పరిచేలా ర్యాలీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. యోగా ర్యాలీ నిర్వహణపై కలెక్టర్ ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు యోగాపై చైతన్య పరిచి ర్యాలీలో పాల్గొనేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో యోగా ర్యాలీలు విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

'దుర్గం'లో వేరుశనగ.. 'కరూరు'లో కంది!

- ఖరీఫ్ పంటల సాగులో ప్రాంతాల వైవిధ్యం
- కళ్యాణదుర్గంలో అత్యధికంగా ఆముదం సాగు
- 15 వేల హెక్టార్లతో పత్తికి కేరాఫ్‌గా నిలిచిన పెద్దవడుగూరు
- మొక్కజొన్న సాగుకు ఖ్యాతిగాంచిన పెద్దపప్పూరు
- కణేకల్లులో వరి సాగే అత్యధికం



వేరుశనగ అంతర సాగులో కంది పంట వేసిన దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో పంటల సాగులో ప్రాంతాల వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తోంది. భూమి నైజం, నీటి లభ్యతను బట్టి వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లా వ్యాప్తంగా వేరుశనగ పంట విస్తీర్ణం గణనీయంగా తగ్గినా కొన్ని మండలాల్లో సాగు అధికంగానే ఉంటోంది. ఇందులో రాయదుర్గం మండల వ్యాప్తంగా రైతులు ఏకంగా 13,953 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఆ తర్వాత గుత్తిలో 11,357 హెక్టార్లు, గుమ్మఘట్టలో 11,034 హెక్టార్లు, గుంతకల్లులో 10,753 హెక్టార్లు, శెట్టూరులో 10,551 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేయనున్నట్లు చెబుతున్నారు. ఈ ఖరీఫ్‌లో ఓవరాల్‌గా 1,82,004 హెక్టార్లలో వేరుశనగ సాధారణ సాగుగా లెక్క వేశారు. డి.హీరేహాల్, కణేకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, కూడేరు, రాప్తాడు, కుందుర్పి, కంబదూరు మండలాల్లోనూవేరుశనగ సాగు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు.

పెద్దవడుగూరుదే అగ్రస్థానం..

ఇక నల్లరేగడి భూముల్లో ఖరీఫ్ పంటగా పత్తి పంట 44,001 హెక్టార్లలో సాగు చేస్తారని అంచనా వేశారు. ఇందులోనూ 15 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి సాగుతో పెద్దవడుగూరు మండలం అగ్రస్థానంలో నిలుస్తోంది. ఆ తర్వాత యాడికిలో 4,533 హెక్టార్లు, పామిడిలో 3,755 హెక్టార్లు, తాడిపత్రిలో 3,540 హెక్టార్లు, గుత్తి, డి.హీరేహాల్ మండలాల్లో 3,900 హెక్టార్లు చొప్పున పత్తి సాగు చేసే అవకాశం ఉంది. కణేకల్లు, బొమ్మనహాల్, విడపనకల్లు, పెద్దపప్పూరు, వజ్రకరూరు, శింగనమల, పుట్లూరు, యల్లనూరు తదితర మరో 22 మండలాల్లో కూడా పత్తి సాగవుతోంది.

కందిపైనే మక్కువ..

గత ఖరీఫ్‌లో 1.03 లక్షల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో కంది సాగుతో చరిత్ర సృష్టించిన రైతులు ఈ ఏడాది కూడా కంది సాగుపైనే దృష్టి పెట్టారు. ఈ ఖరీఫ్‌లో 55,296 హెక్టార్లలో కంది సాగులోకి వస్తుందని అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా వజ్రకరూరు మండలంలో 8 వేల హెక్టార్లు, గుంతకల్లులో 5,500 హెక్టార్లు, కళ్యాణదుర్గంలో 4 వేల హెక్టార్లు, అనంతపురంలో 3,500 హెక్టార్లు, ఉరవకొండలో 3,400 హెక్టార్లు, బెళుగుప్పలో 3,300 హెక్టార్లు, రాప్తాడులో 3 వేల హెక్టార్లలో సాగులోకి వచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని 31 మండలాల్లోనూ అంతర సాగుగా కంది పంట వేయనున్నట్లు సమాచారం.

రెట్టింపు స్థాయిలో మొక్కజొన్న సాగు..

ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న పంట 14,563 హెక్టార్లలో సాగులోకి వచ్చే అవకాశాలున్నాయి. గతంతో పోల్చుకుంటే ఇది రెట్టింపు స్థాయిలో ఉండడం విశేషం. పెద్దపప్పూరులో అత్యధికంగా 2,300 హెక్టార్లు, యాడికిలో 1,500 హెక్టార్లు, పుట్లూరులో 1,500 హెక్టార్లు, కణేకల్లులో 1,200 హెక్టార్లు, గుమ్మఘట్టలో 1,100 హెక్టార్లలో రైతులు మొక్కజొన్న సాగు చేస్తారని అంచనా వేశారు. రాయదుర్గం, తాడిపత్రి, అనంతపురం సబ్ డివిజన్లలోనూ మొక్కజొన్న సాగు పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. అలాగే ఈ ఏడాది 16,293 హెక్టార్లలో ఆముదం సాగులోకి రానున్నట్లుగా అంచనా వేశారు. ఇందులో కళ్యాణదుర్గం మండలంలో అత్యధికంగా 2,300 హెక్టార్లు, కూడేరులో 2,200 హెక్టార్లు, ఆత్మకూరులో 1,800 హెక్టార్లు, బెళుగుప్పలో 1,700 హెక్టార్లతో పాటు మరో 20 మండలాల్లో ఆముదం సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇక కణేకల్లులో ఎప్పటిలాగానే వరి సాగుపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఖరీఫ్‌లో మొత్తం 20 వేల హెక్టార్లలో వరి సాగులోకి రానున్నట్లుగా అధికారులు అంచనా వేయగా... ఇందులో అత్యధికంగా కణేకల్లు మండలం 5 వేల హెక్టార్లు ఉండడం విశేషం. ఆ తర్వాత బొమ్మనహాల్ మండలంలో 3,400 హెక్టార్లు, గార్లదిన్నె మండలంలో 1500 హెక్టార్లు, శింగనమల మండలంలో 1,200 హెక్టార్లు, పామిడి మండలంలో 1,100 హెక్టార్లతో పాటు రాయదుర్గం, ఉరవకొండ, అనంతపురం సబ్‌డివిజన్ల పరిధిలోనూ వరి నాట్లు వేయనున్నారు.

14వేల హెక్టార్లలో మిగిలిన పంటలు..

అనంతపురం, యాడికి, పెద్దవడుగూరు, పామిడి, బొమ్మనహాల్ మండలాల్లో జొన్న పంట, డి.హీరేహాల్, పెద్దవడుగూరు మండలాల్లో కొర్ర, బ్రహ్మసముద్రంలో పెసర, పుట్లూరులో మినుము, నార్పలలో అలసంద లాంటి పంటలు కాస్త ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఉరవకొండ, రాయదుర్గం, గుత్తి సబ్ డివిజన్ల పరిధిలో ఎండుమిరప 18 వేల హెక్టార్ల విస్తీర్ణంలో సాగులోకి రావచ్చని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో టమాట, రాయదుర్గం డివిజన్‌లో వెయ్యి హెక్టార్లలో ఉల్లి పంట సాగు చేసే అవకాశం ఉన్నట్లుగా సమాచారం.

ప్రతి విద్యార్థికీ మిత్ర కిట్లు అందించాలి



బత్తలపల్లి ఎమ్మార్సీలో విద్యార్థి మిత్ర కిట్ల గురించి ఆరా తీస్తున్న విద్యాశాఖ జేడీ సుబ్బారావు

బత్తలపల్లి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ప్రతి విద్యార్థికీ అందేలా చొరవ తీసుకోవాలని ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్, విద్యాశాఖ జేడీ సుబ్బారావు పేర్కొన్నారు.బత్తలపల్లిలోని ఎమ్మార్సీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మిత్ర కిట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అందిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు, బ్యాగులు, బెల్ట్‌ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు. నిర్ణీత సమయంలోపు కిట్ల పంపిణీ ప్రక్రియ పూర్తి కావాలని ఎంఈఓలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌నాయక్, ఎమ్మార్సీలు గోవిందరెడ్డి, వెంకటరమణ, సునీత, మంజుల, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుక్కచెర్ల రామకృష్ణారెడ్డి, నరసింహమూర్తి, షరీఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఇదేనా సంపద సృష్టి!



గుంతకల్లు నుంచి పత్తికొండకు పల్లె వెలుగు బస్సులో వసూలు చేసిన టిక్కెట్ ధర రూ.40



పత్తికొండ నుంచి గుంతకల్లుకు పల్లె వెలుగు బస్సులో వసూలు చేసిన టిక్కెట్ ధర రూ.50

గుంతకల్లు: తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టి చేసి ప్రజలకు పంపిణీ చేస్తామని హామీనిచ్చిన కూటమి పెద్దలు... అధికారం చేపట్టిన తర్వాత కంటికి కనిపించని దోపిడీకి తెరలేపారు. ఒకే దూరం.. ఒకే రకమైన ఆర్టీసీ బస్సులో ప్రయాణానికి రూ.10 వ్యత్యాసంతో చార్జీలు వసూలు చేయడమే ఇందుకు నిదర్శనం. గుంతకల్లుకు చెందిన ఓ ప్రయాణికుడు ఆదివారం ఉదయం పల్లె వెలుగు బస్సులో బురుజల మీదుగా 35 కి.మీ. దూరంలో ఉన్న పత్తికొండకు వెళ్లాడు. ఇందుకు గాను టికెట్ ధర రూ.40 చెల్లించాడు. అక్కడ పని ముగించుకున్న అనంతరం సాయంత్రం పల్లె వెలుగు బస్సులోనే బురుజల మీదుగా గుంతకల్లుకు చేరుకున్నాడు. ఇందుకు గాను టికెట్ ధర రూ.50 చెల్లించాడు. ఉదయం రూ.40 తీసుకున్నారు... సాయంత్రం రూ.50 తీసుకుంటున్నారు ఎందుకంటూ కండక్టర్‌ను నిలదీయడంతో ఉదయం 35 కి.మీ. దూరం ఉందని, సాయంత్రం 40 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోందని కండక్టర్ తెలపడంతో ప్రయాణికులు అవాక్కయారు. ఈ వ్యత్యాసం వెనుక ఉన్న దోపిడీ ప్రభుత్వ పెద్దలకే తెలియాలని విమర్శలు గుప్పించారు.

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు



ప్రయాణికుల బ్యాగ్‌లు పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

గుత్తి: గంజాయి అక్రమ రవాణాపై రైల్వే పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో ఆదివారం గుత్తి రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇకపై రోజూ తనిఖీలు చేపట్టనున్నామని, ఇందుకు ప్రయాణికులు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్‌ఐ నాగప్ప విజ్ఞప్తి చేశారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతుడు వెంకటయ్య

గుత్తి: స్థానిక జీఆర్పీ పరిధిలోని జక్కలచెరువు – రాయలచెరువు రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం రైలు నుంచి జారిపడి ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం చౌదరిపల్లికి చెందిన వెంకటయ్యగా గుర్తించారు. రైలులో తలుపు వద్ద నిలబడి ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మృతదేహాన్ని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

తాడిపత్రిలో పట్టపగలే చోరీ



వంటి గది గ్రిల్ తొలగించిన దృశ్యం

తాడిపత్రిటౌన్: స్థానిక రూరల్ పీఎస్ పరిధిలోని సాయినగర్‌లో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. సాయినగర్‌లో నివాసముంటున్న కుళ్లాయిరెడ్డి ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన ఓ దుండగుడు వంట గదిలోని కిటికీ గ్రిల్ తొలగించి లోపలకు ప్రవేశించాడు. అక్కడే ఉన్న తాళాలు తీసుకుని బీరువా తెరిచి అందులోని ఒక బంగారు చైన్, నల్లపూసల దండ, కమ్మలు మొత్తం ఎనిమిది తులాల బంగారంతో పాటు వెండి సామగ్రిని అపహరించాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుళ్లాయిరెడ్డి కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్నయ సీఐ శివగంగాధరరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గంజాయి తరలింపుదారుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

అనంతపురం సిటీ: రైలులో గంజాయి తరలిస్తూ అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఇద్దరు యువకులు రైల్వే పోలీసులకు పట్టుబడ్డారు. జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన మేరకు... అందిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం అనంతపురం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన రైలులో అనంతపురంలో దిగిన ప్రయాణికుల బ్యాగ్‌లు పరిశీలించారు. సమయంలో రెండు బ్యాగ్‌లో 24 కిలోల గంజాయిని గుర్తించి, సంబంధీకులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో రాప్తాడు మండలం సీపీఐ కాలనీ, కంబదూరు కొట్టాలకు చెందిన బిస్కట్ ఫయాజ్, బిస్కట్ మహబూబ్‌పీరా ఉన్నారు. వీరు భువనేశ్వర్ నుంచి గంజాయి తెచ్చి ఎక్కువ ధరకు అమ్మేవారని విచారణలో నిర్ధారణ అయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు ఎస్‌ఐలు పవన్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సత్యనారాయణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కేవీవీ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీఎంసీలోని న్యూరో సర్జరీ విభాగాధిపతిగా ఉన్న ఆయనను తాత్కాలిక అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. అలాగే అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద ఇక్కడ పని చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావును ఒంగోలు ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును కడప జీజీహెచ్‌కు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు.

వారిని ఎన్‌కౌంటర్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్

అనంతపురం టవర్‌క్లాక్: రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో బాలికను బెదిరించి సామూహిక అత్యాచారంతో గర్భవతిని చేసిన కామాంధులను ఎన్‌కౌంటర్ చేయాలని, ఇందుకు అవసరమైతే చట్టంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా ఆదివారం అనంతపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. దళిత బాలికను బెదిరించి ఆరు నెలల పాటు 17 మంది యువకులు అత్యాచారం చేశారని తెలిపారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి, న్యాయం చేకూరేలా కామాంధులను బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై వాస్తవాలు నిగ్గు తేల్చేందుకు సోమవారం ఏడుగుర్రాలపల్లిలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి దళిత సంఘాలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్ కొడవండ్ల, బీకేఎస్ ఆనంద్, ఓబులేసు, చంద్ర, వన్నూరుస్వామి, మదమంచి శ్రీనివాసులు, రామకృష్ణ, దావిదు, సూర్యనారాయణ, ఎర్రిస్వామి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- దళిత బాలికపై అత్యాచారం చేసి గర్భవతిని చేసిన వారికి ఉరి శిక్ష వేయాలని ప్రభుత్వాన్ని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల యల్లన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారాన్ని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఈఎఫ్ నాయకులు రామచంద్ర, కేపీ నారాయణస్వామి పాల్గొన్నారు.

నేడు షైనింగ్ స్టార్స్ అవార్డుల పంపిణీ

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటి 'షైనింగ్ స్టార్స్'గా ఎంపికైన విద్యార్థులకు సోమవారం అనంతపురంలోని మూడో రోడ్డులో ఉన్న జీఆర్ ఫంక్షన్ హాల్‌లో అవార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు ఆదివారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. జిల్లాలో 184 మంది పదో తరగతి విద్యార్థులు, 35 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు అవార్డులకు ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు పురస్కారం అందజేయనున్నారు. విద్యార్థులు ఆయా స్కూళ్ల యూనిఫాంతో ఉదయం 9 గంటల్లోపు వేదిక వద్దకు చేరుకోవాలి. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకూ భోజన వసతి కల్పించారు. ముఖ్య అతిథులుగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరు కానున్నారు.

తన్నుకున్న 'తమ్ముళ్లు'

గార్లదిన్నె: మండలంలోని కనుంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర దాడులతో రెచ్చిపోయారు. టీడీపీ కార్యకర్తలు ప్రసాద్, కుమార్, వెంకటలక్ష్మికి అదే పార్టీకి చెందిన రాము, సంతోష్, ఇందు, నల్లమ్మతో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని ఆదివారం ఇరు వర్గాలు రాళ్లు, కట్టెలతో దాడులు చేసుకున్నారు. ఘటనలో గాయపడిన ఇరు వర్గాల వారినీ స్థానికులు 108 ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డెడ్ స్టోరేజీకి 'పీఏబీఆర్' నీటి మట్టం



పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం గణనీయంగా తగ్గుతోంది. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో లేదు. ఉమ్మడి జిల్లాలోని తాగునీటి పథకాలకు, నీటి ఆవిరి, లీకేజీల కారణంగా రోజుకు 80 క్యూసెక్కుల వరకు నీరు బయటకెళుతోంది. దీంతో రోజురోజుకూ నీటి మట్టం తగ్గుతోంది. రిజర్వాయర్ వాస్తవ నీటిమట్టం 11.1 టీఎంసీలు కాగా.. ఆదివారం నాటికి 2.3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కష్టాల 'యోగ'ం



బొమ్మనహాళ్‌లో యోగా చేస్తున్న అధికారులు

- యోగా డే యాప్ సర్వే పేరుతో కార్యదర్శులకు సర్కార్ టార్గెట్లు
- ఓటీపీలతో తప్పని ఇక్కట్లు

బొమ్మనహాళ్: ప్రచార ఆర్భాటానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న కూటమి సర్కార్ తీరుతో అధికారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రతి పనికీ సర్వేల పేరుతో ఇటు సచివాలయ సిబ్బందిని, అటు ప్రజలనూ ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో పని ఒత్తిడికి లోనైన సచివాలయాల కార్యదర్శుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. తాజాగా యోగ యాప్ అంటూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలంటూ జారీ అయిన ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులకు కష్టాల 'యోగ'ం రెట్టింపయింది.

ఫేస్ రికగ్నైజేషన్‌తో తిప్పలు

సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి యోగా యాప్ చూపించి వారు వస్తారో లేదో తెలుసుకుని వివరాలు నమోదు చేయాలి. హాజరయ్యేందుకు ఆసక్తి చూపితే వివరాల నమోదు సమయంలో వారి ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసి సబ్మిట్ చేయాల్సి దరఖాస్తు పూర్తి చేసినట్లే. ఇంత వరకూ అంతా బాగున్నా... నో ఆప్షన్ పెడితే... ఆ కుటుంబంలో ఎవరో ఒకరిది ఫేష్ రికగ్నైజేషన్ లేదా బయోమెట్రిక్‌తో వివరాలు పూర్తి చేయాల్సి ఉంది. నో ఆప్షన్ కింద వివరాలు నమోదు చేయడం కార్యదర్శులకు చుక్కలు చూపిస్తోంది. 'కార్యక్రమంలో పాల్గొనడం తమకు ఆసక్తి లేదంటే ఫొటో తీస్తారా? బయోమెట్రిక్ కావాలని అడుగుతారా? అసలు ఎందుకివ్వాలి? ముందు ఇక్కడి నుంచి వెళ్లిపోండి?' అంటూ గృహ యజమానులు అసహనం వ్యక్తం చేస్తుండడంతో వారికి నచ్చ చెప్పుకోలేక కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. అసలే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేపర్లు, సోషల్ మీడియాల్లో వార్తలు వస్తున్నాయని, ప్రభుత్వం, పోలీసులు, అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్న తరుణంలో ఓటీపీలు అడగడమేంటని ప్రశ్నిస్తున్నారు.

ఓ వైపు శిక్షణ... మరోవైపు పోటీలు

మూడు రోజుల క్రితం యోగాంధ్ర యాప్‌లో పంచాయతీల్లో యోగాసనాలపై మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చినట్లు వివరాలు నమోదు చేయాలని నిబంధన పెట్టారు. ఒక వైపు మండల స్థాయిలో మాస్టర్స్ ట్రైనర్స్‌తో శిక్షణా కార్యక్రమాలునిర్వహిస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత సచివాలయ స్థాయిలో యోగా తరగతులు నిర్వహించాలని అధికారులు ఇప్పటికే సూచించారు. ఇది పూర్తి కాకుండానే పంచాయతీల పరిధిలో పోటీలు ఎలా పెట్టాలో, శిక్షణ లేని వారు పోటీల్లో ఎలా పాల్గొంటారో అర్థం కావడం లేదని సచివాలయ కార్యదర్శులు వాపోతున్నారు.

ప్రజా సేవలకు దూరంగా...

ఒక్కో సచివాలయ పరిధిలో వేలాది మందిని సర్వే చేసి యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నదీ.. లేనిది వివరాలు నమోదు చేయాలంటే ఎన్ని రోజులు పడుతుందో ఉన్నతాధికారులకే ఓ అంచనా లేదు. అన్నీ బాగుండి సర్వర్ మొరాయించకపోతే పూర్తి చేయడానికి ఒక్కో వ్యక్తి దగ్గర కనీసం 10 నిమిషాల సమయం పడుతోంది. దీంతో కార్యదర్శులు ప్రజా సేవలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ప్రస్తుతం సచివాలయాల వద్దకు రేషన్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇలాంటి తరుణంలో సర్వేల పేరుతో కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Tech. అడ్మిషన్స్

■ ఇంటర్‌లో M.P.C పాస్ + AP EAPCETలో క్వాలిఫై కానీ వారికి, ఎంట్రెన్స్ రాయని వారికి B.Tech. (Any Branch) నందు ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. Only హాస్టల్ ఫీజు మాత్రమే కట్టుకోవాలి. Cont: G.MURALI, 9030661651, అనంతపురం. [A-1640]

B. Pharmacy అడ్మిషన్స్

■ ఇంటర్ లో Bi.P.C పాస్ + AP EAPCET లో క్వాలిఫై కానీ వారికీ, ఎంట్రెన్స్ రాయని వారికీ B.Phamacy నందు ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. Only హాస్టల్ ఫీజు మాత్రమే కట్టుకోవాలి. Cont:- G.MURALI, 9030661651, అనంతపురం. [A-1641]

REAL ESTATE

PLOTS FOR SALE

■ అరవకూరు దగ్గర బళ్లారి హైవేకి మొదటి బిట్టు, ఎయిర్ పోర్ట్ దగ్గర లోని 50 సెంట్స్ & 40 సెంట్స్ & 65 సెంట్స్ అమ్మకానికి కలవు. 9063443390. [A-6507]

COMMERCIAL PLOT SALE

■ అనంతపురం, బళ్ళారి బైపాస్ రోడ్‌కు, రాచానపల్లి – U టర్న్ దగ్గర 5.5 సెంట్లు కమర్షియల్ బిట్ అమ్మకానికి కలదు. సెల్: 9177266885. [A-6508]

HOUSE FOR SALE

■ ATP-BKS దేవరకొండ TTD కల్యాణ మండపం పక్కన, మా వెంచర్ శ్రీ పాదం హిల్ వ్యూ నందు, ₹ 30 లక్షలకే – 3 సెంట్లలో 2BHK ఇల్లు అమ్మబడును. వెంటనే సంప్రదించండి: 9515860608 [SCA25004643]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6749]

WANTED

■ తాడిపత్రి హాస్పిటల్ లో పని చేయుటకు క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్ & నర్సులు అర్జెంటుగా కావలెను. సంప్రదించండి : సెల్ : 7416964894. [SCA25004530]

■ శ్రీ సత్యసాయి అకాడమీ నందు జాబ్ చేయుటకు (FEMALE) టెలికాలర్స్ కావలెను. సంప్రదించండి. సెల్: 9515149984, అనంతపురం. [SCA25004747]

■ కొత్త చెరువు ఏరియా పాల శీతలీకరణ కేంద్రాలలో పనిచేయుటకు సహాయకులు (ఇంచార్జ్) టెస్టర్లు, అర్హత: ఇంటర్ / ఏదైనా డిగ్రీ. career@shreejamilk.com, 9154282113. [T-735]

■ అనంతపురం టౌన్, శ్రీకంఠం సర్కిల్ నందు షోరూమ్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. విద్యార్హత ఇంటర్ వయస్సు : 35 – 40 సం॥ ఎక్స్‌పీరియన్స్ కలిగిన లోకల్ వారు మాత్రమే. సంప్ర: 8179290778. [A-1639]

■ HP పెట్రోల్ బంక్ నందు పని చేయుటకు బాయ్స్ కావలెను. టైమ్ 24 గం. శాలరీ రోజుకు ₹ 850. అడ్రస్: ఆలమూరు రోడ్, పెద్దమ్మతల్లి పెట్రోల్ బంక్, సత్యసాయికాలేజ్ ఎదురుగా, అనంతపురం. 9703234171 [SCA25004746]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ బెల్ ఇన్ ఫ్రా నందు పనిచేయుటకు, అనుభవం గల టెలికాలర్స్ (స్త్రీలు) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టీమ్‌తో వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత. టార్గెట్‌తో పనిలేకుండా ఫిక్స్‌డ్ జీతం ఇవ్వబడును. అడ్రస్: 1వ ఫ్లోర్, సహారా అపార్ట్‌మెంట్, బళ్ళారి రోడ్, ATP.సెల్: 9989452444, 8919159081. [A-1638]

■ అనంతపురం పట్టణం నందు Airtel Fiber లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలేయును. జీతం: 16500 + ఇన్సెంటివ్, ఆండ్రాయిడ్ ఫోన్ + బైక్ + డ్రైవింగ్ లైసెన్స్ ఉండవలెను. సంప్రదించండి : ఉమామహేశ్వర రెడ్డి సెల్: 9000029003. [SCA25004760]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
ఫర్నిచర్స్ | ఆటోమొబైల్ | కంప్యూటర్స్ | సర్వీసెస్
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

క్లుప్తంగా

గోమాతకు అంతిమ సంస్కారాలు


పూజలు చేస్తున్న విజయకుమార్

అనంతపురం కల్చరల్: నగరంలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో తీవ్ర గాయాలపాలై మృతి చెందిన ఓ గోవుకు సాయిట్రస్టు వారు ఆదివారం అంతిమ సంస్కారాలు జరిపించారు. గోవుకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రత్యేక వాహనంలో రాచానపల్లి ఏరు వద్ద సమాధి చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గోవులను పెంచుకుంటున్న యజమానులు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోకపోవడంతో జీవాలు రోడ్లపై సంచరిస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయని తెలిపారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని యజమానుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించాలని కోరారు. ప్రత్యేక గోశాల ఏర్పాటు చేసి అక్కడ వాటికి రక్షణ కల్పించాలని సూచించారు.

బట్రాజుల సంక్షేమానికి కృషి చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో బట్రాజుల సంక్షేమానికి కృషి చేయాలని సీనియర్ నాయకుడు సుధాకర్‌రాజు సూచించారు. ఆదివారం స్థానిక బట్రాజుల కళ్యాణ మంటపంలో నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రాజు కమిటీని ప్రకటించారు. జిల్లా బట్రాజుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా మనోహర్ కుమార్, ట్రెజరర్‌గా మారుతి రాజు, ఉపాధ్యక్షులుగా సరోజమ్మ, శ్రీనివాస్ వర్మ,బాలగిరి నాగభూషణ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోవిందరాజులు, జాయింట్ సెక్రటరీగా రంగానాథం, అనసూయమ్మను ఎన్నుకున్నారు.

వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్యవైశ్య విద్యార్థులు వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని వైశ్య హాస్టల్ కార్యదర్శి ముడియం రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద ఆర్యవైశ్య విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని సదుపాయలతో నాణ్యమైన ఆహారం అందిస్తామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

అనంతపురం రూరల్: బక్రీద్ పండగను పురస్కరించుకుని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ మాస్టర్ మక్బూల్‌బాషా, రామ్ డ్యాన్స్ అకాడమీ డ్యాన్స్ మాస్టర్ రమణ ఆధ్వర్యంలో జానపద, క్లాసిక్, సినిమా పాటలకు చిన్నారులు స్టెప్పులతో అదరగొట్టారు. ఈ సందర్భంగా శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు వినోదాన్ని పంచాలన్న ఉద్దేశంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

సాయి సేవకుల భిక్షాటన

అనంతపురం కల్చరల్: రానున్న గురు పౌర్ణమిని పురస్కరించుకుని సాయి సేవకులు భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మూడవ రోడ్డులోని షిర్డీ సాయి బాబా మందిరం, చుట్టుపక్కల వీధుల్లో జోలెలు పట్టుకుని బియ్యం, ఇతర నిత్యావసరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. జూలై 10న గురు పౌర్ణమి వేడుకలు జరుగుతాయన్నారు. నెల రోజుల ముందు నుంచి హోదాలు మరచి భక్తులందరూ భిక్షాటన చేస్తూ పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వివిధ వేడుకల శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220732, 9912220719, 9912220724
9010223702, 7093156622, 9010567770, 7093157766

రెచ్చిపోతున్న పచ్చమూకలు

- గత నెల 21న టీడీపీ గల్లీ నాయకులు సరిపూటి శ్రీకాంత్, లక్ష్మీనరసింహ, తదితరులు మేయర్ వసీం చాంబర్ వద్దకు వెళ్లారు. మూసి ఉన్న తాళాలు తెరవకపోతే పగలగొడుతామంటూ సిబ్బందిని బెదిరించారు. చివరకు మేయర్ చాంబర్‌లోకి ప్రవేశించి ఫైల్స్‌ను పక్కకు పడేసి నానా హంగామా చేశారు.
- గత నెలలో టీడీపీ మహానాడుకు స్థానిక ప్రజలను పురమాయించలేదని 29వ వార్డు సచివాలయ కార్యదర్శి అశ్వత్థరెడ్డిపై 30వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ రాజేష్ నాయుడు నానా దుర్భాషలాడారు. ఏరా..ఎ..కొడకా..నీ..మ్మా అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడాడు. ఇదే విషయమై సచివాలయ ఉద్యోగులు భారీ సంఖ్యలో వెళ్లి తొలుత టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇంత వరకు టూటౌన్ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.
- ఈనెల 6న 39వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతకుంట మధుపై టీడీపీ నాయకులు మోహన్ కుమార్, అఖిల్, ఏఆర్ పీసీ నరేంద్రతో పాటు మరికొందరు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దీనిపై మేయర్ వసీం తదితరులు 4వ పట్టణ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకోవడానికి కూడా ఎస్‌ఐ ప్రసాద్ విముఖత వ్యక్తం చేశారు.


టీడీపీ నాయకుడిపై ఫిర్యాదు చేసేందుకు టూటౌన్ పీఎస్ వద్దకు వచ్చిన సచివాలయ ఉద్యోగులు (ఫైల్)


మేయర్ వసీం చాంబర్‌లో టీడీపీ నాయకుల హల్‌చల్ (ఫైల్)

- నగరపాలక సంస్థలో భయానక వాతావరణం సృష్టిస్తున్న టీడీపీ నాయకులు
- దౌర్జన్యం, రౌడీయిజం చేస్తూ బెదిరింపులు
- ఇటీవల మేయర్ చాంబర్‌లోకి ప్రవేశించి హంగామా చేసిన చోటా నాయకులు
- 29వ వార్డు సచివాలయ కార్యదర్శిపై బూతుల పర్వం
- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న పోలీసులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు, రౌడీయిజానికి, బరితెగింపులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. చిన్న ఉద్యోగులు నుంచి అధికారుల వరకు హడలెత్తిపోతున్నారు. వైఎస్సార్ సీపీ పాలకవర్గం ముగియకుండానే వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మేయర్‌లపై కూడా దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. 2014 నుంచి 2019 వరకు ఇటువంటి పరిస్థితే ఉన్నా.. ఇప్పుడు అంతకు మూడు రెట్లు దౌర్జన్యానికి టీడీపీ బచ్చా నాయకులు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా నాలుగో సింహం మాత్రం తమకేం పట్టదన్న ధోరణిలో ఉంటోంది. ఇక ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి టీడీపీ చోటా నాయకులు నిత్యం నగరపాలక సంస్థలో తిష్ట వేస్తున్నారు. అందుకు నగరపాలక సంస్థలోని పలువురు ఈఈ, డీఈ స్థాయి అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రూ.20 లక్షల సీ బిల్లులు అడ్డగోలుగా చేశారు. ఇదెలా ఉన్నా నగరపాలక సంస్థ ఇంజినీర్లు టీడీపీ చోటా నాయకులతో కలసి నగరపాలక సంస్థ ముందు పిచ్చాపాటి మాట్లాడుతూ కాలయాపన చేసిన సందర్భాలు కోకొల్లలు.

పాలకవర్గం లేకున్నా..

ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలకవర్గం నడుస్తోంది. పాలకవర్గం టీడీపీది లేకున్నా.. తమ ప్రభుత్వం అంటూ నగరపాలక సంస్థలో భయాందోళన వాతావరణం సృష్టిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులకు అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ప్రస్తుత మేయర్ వసీం ఫ్రీ హ్యాండ్స్ ఇవ్వడంతో పాటు ఏ పనుల్లోనూ జోక్యం చేసుకునే వారు కాదు. కానీ ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. రాబోవు రోజుల్లో మరీ దారుణమైన పరిస్థితులను చూడక తప్పదని నగరపాలక సంస్థ వర్గాలు అంటున్నాయి.

ప్రజలే బుద్ధి చెబుతారు



కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకుల ఆగడాలకు అడ్డూఅదుపు లేదు. స్వయంగా నా చాంబర్‌లోకి ప్రవేశించి హంగామా చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశాం. ఇటీవల సచివాలయ ఉద్యోగిపై దుర్భాషలు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతకుంట మధుపై దాడికి పాల్పడ్డారు. ఇంత కన్నా దారుణం ఎక్కడ ఉంటుంది? ఈ ఘటనలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు. టీడీపీ దౌర్జన్య పాలనకు ప్రజలే బుద్ధి చెబుతారు.
– వసీం, మేయర్

మెరుగైన సేవలందించాలి


క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: ఇటీవల గార్లదిన్నె మండలం తిమ్మంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆదివారం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికందే సేవల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఆర్థో హెచ్‌ఓడీ డాక్టర్ ఆత్మారాం తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి వితరణ


తోపుడు బండి అందజేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ప్రతినిధులు

రాప్తాడురూరల్: ఓ నిరుపేద మహిళకు ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ అండగా నిలిచింది. అనంతపురం రూరల్ కళ్యాణదుర్గం రోడ్డులోని నరిగమ్మ గుడి వద్ద వెంకటమ్మ అనే మహిళ ఆకుకూరల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈమె భర్త ఫెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం సామాజిక సేవా సంస్థ గౌరవ సలహాదారు రంగయ్య దృష్టికి వచ్చింది. ఆయన ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ తాడిపత్రి శాఖ వారిని సంప్రదించారు. వారి చొరవతో వెంకటమ్మకు ఆకుకూరలు అమ్ముకోవడానికి ఒక కొత్త తోపుడు బండిని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో తాడిపత్రి ఉపఖజానా అధికారి ఫరూక్ మహ్మద్, స్కూల్ అసిస్టెంట్ బాలన్న గారి శివ శంకరయ్య, ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ తాడిపత్రి శాఖ ఉపాధ్యక్షులు వద్ది చంద్రశేఖర్, గౌరవ సలహాదారు రంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ఉపాధ్యక్షుడు కరుణాకర్, కన్వీనర్ దొగురు శ్రీహరి, జాయింట్ సెక్రటరీ ఎ.కుమార స్వామి, సభ్యులు టీచర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలి



మాట్లాడుతున్న ఓబులు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చేలా కార్మిక చట్టాల్లో మార్పులు చేసిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మిక చట్టాల సవరణ, నాలుగు లేబర్ కోడ్ల రద్దుకు జూలై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మె జయప్రదానికి సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఓబులుతో పాటు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, శ్రామిక మహిళ కన్వీనర్ రమాదేవి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మహిళలకు రక్ష లేకుండా పోయిందన్నారు. లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులట్లో రాత్రివేళ మహిళలతో పనులు చేయిస్తే వారికి రక్షణ ఎలా అని ప్రశ్నించారు. కార్మిక చట్టాల్లో చేసిన మార్పులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో వీధి పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. కార్మికవర్గం కన్నెర్రచేస్తే ప్రభుత్వం పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ కోశాధికారి, నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట నారాయణ, ముత్తుజ, భవన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు శకుంతల, నాయకురాళ్లు నిర్మల, మేరీ, గోవిందమ్మ, లక్ష్మీనరసమ్మ, పాతక్క, రామంజనమ్మ, మెడికల్ రెప్ సంఘం నాయకులు చంద్రశేఖర్, కార్మిక సంఘం నాయకులు రాము, అశోక్, సంజప్ప, మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు ఆది, ఎర్రిస్వామి, తిరుమలేష్, ఆటో కార్మిక సంఘం నాయకుడు ఆది, ఆశావర్కర్ల సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

మాంసం విక్రయదారులపై కొరడా


జరిమానా విధిస్తున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, చిత్రంలో కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: మాంసం విక్రయదారులపై నగరపాలక సంస్థ అధికారులు కొరడా ఝులిపించారు. ఆదివారం కమిషనర్ బాలస్వామి నేతృత్వంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, ఎస్‌ఈ చంద్రశేఖర్, తదితరులు బృందాలు ఏర్పడి లెక్చరర్స్ కాలనీ, పాతూరు మటన్ మార్కెట్, రాణినగర్, మొదటి రోడ్డు నుంచి ఆరవ రోడ్డు వరకు చికెన్, మటన్ వ్యాపార సముదాయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ గుర్తించారు. ఇప్పటికే చాలా సార్లు తెలియజేసినా.. మీలో ఎటువంటి మార్పు రాలేదని వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం ద్వారా పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం ఆగే వరకు నిరంతరంగా దాడులు కొనసాగిస్తామని హెచ్చరించారు. నగర ప్రజలు జూట్ బ్యాగులు, క్యారియర్లు వాడాలన్నారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

'షైనింగ్ స్టార్స్' పురస్కారాలకు ఎంపిక

అనంతపురం ఎడ్యుకేషన్: సీనియర్ ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులతో మెరిసిన ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రతిష్టాత్మక 'షైనింగ్ స్టార్స్' ప్రతిభా పురస్కారాలకు నారాయణ కళాశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వివరాలను నారాయణ కళాశాలల అనంతపురం కోర్ డీన్ బీకే బద్రీనాథ్ వెల్లడించారు. జిల్లాలో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 13 మంది ఎంపిక కాగా ఇందులో తమ కళాశాల నుంచి డి.నిత్యశ్రీ 986 మార్కులు, కేబీ నిరంజన్ 989, వి.అనుష్క దేవి 991, డి.దివ్య 983, ఎస్.నిశ్చితా 983, కే.కీర్తి 965 మార్కులు సాధించి ఎంపికయ్యారన్నారు. సోమవారం నిర్వహిస్తున్న సన్మాన కార్యక్రమంలో ఈ విద్యార్థులు ప్రభుత్వం తరఫున రూ.20 వేల నగదు, పతకం, ప్రశంసా పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందుకుంటారన్నారు. షైనింగ్ స్టార్స్‌గా ఎంపికైన విద్యార్థులను నారాయణ కళాశాలల డీజీఎం వెంకటరామిరెడ్డి, డీన్లు శ్రీనివాస రెడ్డి, వెంకటనారాయణ, ప్రిన్సిపాల్స్ శ్రీధర్ బాబు, శిఖామణి, హిమబిందు, శైలజ అభినందించారు.

మిత్రమా.. కుశలమా


ఆత్మకూరు: సమావేశమైన 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరడంతో సందడి నెలకొంది. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ గురువులు విజయ కుమారి, రామచంద్రారెడ్డి, రామాంజినరెడ్డి, సావిత్రమ్మ, విష్ణుమూర్తి, రమణ, అంకిరెడ్డి, వెంకట్రాముడును పూలమాలు, శాలువాలు కప్పి సన్మానించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనంతపురం ఎడ్యుకేషన్: 32 ఏళ్ల కిందట గుడ్ షప్పర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ (ప్రస్తుతం లేదు)లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోని అలెగ్జాండర్ హోటల్ వేదికగా సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన విద్యార్థులు ఇన్నేళ్ల తర్వాత ఒకచోట కలుసుకోవడంతో ఆనందానికి అంతులేకుండా పోయింది. చదువు చెప్పిన పాఠశాల హెచ్ఎం ఇందిరా, ఉపాధ్యాయులు ప్రభావతి, పద్మ, ఈశ్వరమ్మ, జెఫమని, రంగయ్య, ఈశ్వరయ్యను సన్మానించారు. పూర్వ విద్యార్థులు శివారెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, అసిఫ్, ధనుంజయ, హేమంత్, శ్రీనాథ్ రెడ్డి, భాగ్యరెడ్డి, భారతి పాల్గొన్నారు.


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కళాకారుల అభ్యున్నతే లక్ష్యం


మహిళను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: కళాకారుల అభ్యున్నతే లక్ష్యంగా లలిత కళాపరిషత్తు ముందుకెళ్తోందని ఎల్కేపీ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది పద్మజ అన్నారు. ఆదివారం రాత్రి లలిత కళాపరిషత్తులో వందల మంది కళాకారులకు సన్మానం జరిగింది. జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన శాస్త్రీయ, వెస్టర్న్, ఫోక్ డాన్సుమాస్టర్లు పద్మజను ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న కళాకారులు, కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించడానికి ఎల్కేపి సిద్ధంగా ఉంటుందన్నారు. ఒకేసారి వంద మంది గురువులను సత్కరించిన డ్యాన్స్ మాస్టర్ విష్ణు కృషిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పట్నం శివప్రసాద్‌తో పాటూ వేర్వేరు డాన్సు అకాడమీల మాస్టర్లు, ఎల్కేపి కార్యవర్గ సభ్యులు సోమిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ఆత్మకూరు: మైనర్ బాలికలపై సామూహికంగా అత్యాచారం చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని ఎన్‌పీఆర్‌డీ (వికలాంగుల హక్కుల జాతీయ వేదిక) జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం వడ్డుపల్లి గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ మాట్లాడుతూ.. అత్యాచారం చేసిన 14 మంది నిందితులకు రాజీకాయ పార్టీలతో సంబంధం లేకుండా శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాలికను బెదిరించి వీడియోలు తీసి అత్యాచారం చేయడం అన్యాయమన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. దళిత కుటుంబానికి రక్షణ కల్పిస్తూ ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకరాలు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గంగన్న, వెంకటేష్, కుళ్లాయప్ప, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

అనంతపురం అర్బన్: భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ఏపీ భవన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ మండిపడ్డారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సంఘం జిల్లా 5వ మహాసభలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన మహాసభలకు సత్యనారాయణతో పాటు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. భవన కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతో పాటు పెండింగ్ క్లయిమ్‌లను తక్షణం పరిష్కరించాలన్నారు. 50 ఏళ్లు పూర్తయిన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు రామాంజనేయులు, లక్ష్మన్న, శ్రీరాములు, దుర్గప్ప, పాల్గొన్నారు.

రెడ్డి వివాహ పరిచయ వేదికకు స్పందన

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక'కు స్పందన లభించింది. వధువు, వరుల బయోడేటాలను పరిశీలించారు. చిన్న రాసి చంద్రమౌళి రెడ్డి, దుబ్బ కిషోర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, దయానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సండే.. సరదాగా


ఆడుకుంటున్న చిన్నారులు

ఆత్మకూరు: బక్రీద్ పండుగ అనంతరం ముస్లింలు కుటుంబ సమేతంగా వంటలు చేసుకుని పర్యాటక ప్రాంతాలకు వెళ్లడం ఆనవాయితీ. ఆదివారం పంపనూరు సిటీ పార్కు పర్యాటకులతో కిటకిటలాడింది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా కుటుంబ సమేతంగా పిల్లలతో కలసి ఆడుకున్నారు. చెట్ల కింద కూర్చొని భోజనాలు ఆరగించారు. పార్కులో సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడిగా గడిపారు.


కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేస్తున్న ముస్లింలు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, డోర్ నెం.54-20-18/3F/U5, 3వ అంతస్తు, రెఫిసి మేడయూర, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, విజయవాడ-520008, ఎన్.టి.ఆర్.జిల్లా.
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ షాహెన్షా హుస్సేన్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 99891 79786
ఆస్తి తనిఖీ కొరకు : 92912 32223

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకువారు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)
SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా ... ఇ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ...
ఋణగ్రహీతల చిరునామా: (1) మెస్సర్స్ ఎమ్‌టిడి డిస్ట్రిబ్యూటర్స్, ప్రొప్రయిటర్: శ్రీమతి దేవరశెట్టి మైథిలి, భర్త : దేవరశెట్టి శ్రీహరి, డి.నెం. 10/419, ఆదిమూర్తి నగర్, అనంతపురం - 515001, ఆంధ్రప్రదేశ్. హామీదారులు : 1. శ్రీమతి దేవరశెట్టి మైథిలి, భర్త : దేవరశెట్టి శ్రీహరి, డి.నెం. 12-997, 6వ క్రాస్, సాయి నగర్, అనంతపురం-515 001, ఆంధ్రప్రదేశ్. వేరొక చిరునామా : శ్రీమతి దేవరశెట్టి మైథిలి, భర్త : దేవరశెట్టి శ్రీహరి, డి.నెం. 10/419, ఆదిమూర్తి నగర్, అనంతపురం - 515 001, ఆంధ్రప్రదేశ్. 2. శ్రీ దేవరశెట్టి శ్రీహరి, తండ్రి: దేవరశెట్టి మద్దులేటి, డి.నెం.12-997, 6వ క్రాస్, సాయి నగర్, అనంతపురం-515 001, ఆంధ్రప్రదేశ్. వేరొక చిరునామా: శ్రీ దేవరశెట్టి శ్రీహరి, తండ్రి: దేవరశెట్టి మద్దులేటి, డి.నెం. 10/419, ఆదిమూర్తి నగర్, అనంతపురం - 515 001, ఆంధ్రప్రదేశ్.
డిమాండ్ నోటీసు తేదీ : 02-07-2024   బకాయి మొత్తం: తేది. 30-06-2024 నాటికి రూ. 96,69,115/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ఆస్తి వివరములు
డాక్యుమెంట్ నెం. 7008/2009, తేది. 14.09.2009 ప్రకారం శ్రీమతి దేవరశెట్టి మైథిలి గారి పేరున గల ఆస్తి: ... కొలతలు: తూర్పు-పడమర: 37 అడుగులు. ఉత్తరం-దక్షిణం: 118 అడుగులు. మొత్తం విస్తీర్ణం: 485.11 చ.గజాలు.
రిజర్వ్ ధర: రూ. 49,50,000/-   ధరావత్తు : రూ. 4,95,000/-   బిడ్ పెంపుదల : రూ. 10,000/-
ఇ-వేలం తేదీ : 21-07-2025, సమయం : ఉ॥ 11.00 నుండి సా॥ 04.00 గం॥ల వరకు
ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం: 09-06-2025 నుండి 20-07-2025 వరకు ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు
ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
1) ... www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices ... M/s. PSB Alliance & M/s. Baanknet ... https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & ... 91-8291220220, Mail ID : support.baanknet@psballiance.com ...
2) ...
గమనిక : ... PSB Alliance ... (Pre-Bid EMD) ... PSB Alliance ...
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.
తేది: 06-06-2025, ప్రదేశం : విజయవాడ   సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా